# ఆ కళ్ళే వర్షిస్తే

గోదావరి ట్రైన్ రాజమండ్రిలో ఆగగానే ఓ వైపు నుండి అమ్మకాల హడావిడితో, మరో వైపున ఎక్కే దిగేవాళ్ళ కోలాహలంతో సందడి ప్రారంభమయింది.

సుధాకర్ కళ్ళు సూర్యం కోసం వెతుకుతున్నాయి. సూర్యం కాళ్ళు అన్నయ్య కోసం పరుగులు తీస్తున్నాయి. 'ఇక్కడ! ఇటు!' సుధాకర్ పిలుపు 'అన్నయ్యా' అన్న సూర్యం ఆత్మీయమైన పలకరింపుతో కలగలిసిపోయింది. పెట్టెలోకి దూకేసినంత హడావిడిగా ఎక్కేసి, అన్నను వాటేసుకున్నాడు. 'పిచ్చివాడా! ఎందుకు ఆ కంగారు? ఇంకా పసివాడివేనా?' సుధాకర్ చేయి ఆప్యాయంగా సూర్యం వీపు నిమిరింది.

"మనం అనుకున్నట్లు, అమ్మకోసం ఆ పని చేసేసరికి నిజంగానే బేజారెత్తిపోయిందిరా! అసలు నేను 'ల' కారం పోగుచేయగలనా? - అని ఆలోచన బుర్ర తొలిచేస్తుంటే పగలు, రాత్రి తెలిసేది కాదు" సుధాకర్ లాలనకు శరీరం సేదతీరుతుండగా సూర్యం అన్నాడు. "నాకూ కొద్దిగా కష్టం అయిందనుకో! ఇప్పుడు అప్పు పుట్టించుకోవడం తేలికే అయినా, తీర్చుకోవడానికి ఏళ్ళ తరబడి మనం శ్రమపడవలసి వుంటుంది. కాని, అమ్మ కోరిక తీరాలంటే ఏమయినా చెయ్యాలిరా! అందుకే నేను రేఖ మాట పెడ చెవిన పెట్టి మరీ ఈ సాహసం చేశాను" ఆ ఇద్దరి మనసుల్లోను తల్లి నిండిపోయింది. గతం కళ్ళ ముందు కదలాడసాగింది. "అవునురా! అమ్మ మనల్ని ఎంత కష్టపడి ఈ స్థితికి తీసుకొచ్చింది? ఆ రోజులేవి? అసలు మరచిపోలేం. నువ్వయితే నాలుగేళ్ళు పెద్దవాడివి. కాస్త ఊహ తెలిసేది. నాకసలు అప్పుడేం తెలిసేది కాదు."

"తెలిసి మాత్రం నేనమ్మ మనసు నొప్పించలేదూ? మనం ఆరోజు అడిగిన పిచ్చి ప్రశ్న గుర్తుకు వస్తే నేనిప్పటికీ కుంచించుకుపోతాను."

"నాకూ అలానే వుంటుంది. తెలిసీ తెలియని వయసులో అయినా అమ్మని మనమలా అడిగి, వేధించడం చాలా పొరపాటు. ఇప్పటికీ అమ్మకి ఎక్కడ జ్ఞాపకం వుందో అని బిడియంగానే వుంటుంది..."

★ ★ ★

సూర్యం, సుధాకర్ ఒకేసారి స్కూలు నుండి వచ్చారు. అమ్మ వాళ్ళకెంతో ఇష్టమైన ఫలహారం చేసినా మౌనంగా తినేసి పుస్తకాలు ముందేసుక్కూర్చున్నారు. తెరిచారన్నమాటే గాని, చదువు తలకెక్కడం లేదు వాళ్ళకి. "అన్నయ్యా! చదవాలని లేదురా" సూర్యం పుస్తకం ప్రక్కన పెట్టేశాడు. "నాకూనూ!" సుధాకర్ పుస్తకం మూసేశాడు.

"మాటిమాటికి మా ఫ్రెండు వాళ్ళ మమ్మీవాళ్ళు ఏమడుగుతున్నారో తెలుసా?" అన్నయ్యకు దగ్గరగా జరిగాడు.

"నేను పోల్చుకోగలను. మా టీచరు నన్ను అస్తమానం అడుగుతున్నమాటే! అందరూ అలానే మనతో అంటున్నారు"

శాంత పిలవడంతో ఇద్దరూ ఉలిక్కిపడ్డారు. "నాకు నైట్ డ్యూటీ వుంది. వంట చేసేశానర్రా! వడ్డించుకు తినండి. నే వెళుతున్నాను. జాగ్రత్తగా తలుపులు వేసుకొని మరీ నిద్రపోండి" శాంతి దూతలా తెల్లని గౌనులో తెల్లని టోపీ పెట్టుకొని బయలుదేరబోతున్న తల్లి ముఖంలోకి అమాయకంగా చూసారు. "అందరూ అంటున్నది నిజమే! అమ్మ కళ్ళు ఎప్పుడూ అందంగా మెరుస్తాయి" పన్నెండేళ్ళ సుధాకర్ అనుకున్నాడు. అవును, అమ్మెప్పుడూ నవ్వుతూనే వుంటుంది. ఎనిమిదేళ్ళు నిండని సూర్యం రెప్పలార్పడం కూడా మర్చిపోయాడు.

"ఏమిటర్రా! అలా చూస్తున్నారు? ఇవాళ కొత్తగా కన్పిస్తున్నానా?" అంది పెదవులపై చిరునవ్వు చెదరకుండానే. నా బంగారు కొండలు!' ఇద్దరినీ దగ్గరకు తీసికొని చెరో ముద్దు పెట్టుకొని వెళ్ళిపోయింది. ఎప్పటిలా అమ్మ ముద్దు రుచించలేదు వాళ్ళకి. అంతేకాదు ఎంతో ప్రయాసపడి ప్రేమామృతం కలగలిపి ఆ మాతృమూర్తి వాళ్ళకోసం వండిన భోజనమూ రుచించలేదు. చుట్టూ నెలకొన్న వాతావరణం, ఆ పసి మనసులను కలుషితం చేసేస్తూంటే ఏవేవో ఊహలు చెద పురుగుల్లా తొలిచేస్తున్నాయి, ఆ చిన్నారి మెదళ్ళను. ఆ విషయాలే మాట్లాడుకుంటూ ఎప్పుడో నిద్రలోకి జారుకున్నారు. ఆ అలజడి ఒక్కరోజులో రేగిందేం కాదు. ఎంతోకాలంగా పరిచయస్తులు, అపరిచితులూ కూడా పనిగట్టుకుని పసివాళ్ళనే ఆలోచన లేకుండా వేధిస్తూనే వున్నారు. ఫలితం? తల్లిపట్ల ఏహ్య భావానికి అంకురార్పణ జరిగిపోయింది. అమ్మంటే గౌరవాభిమానాలు పెరగవలసిన ఆ లేత మనసులలో కలుపు మొక్కల్లా అసూయా ద్వేషాలు పెరిగిపోతున్నాయి.

మర్నాడు ఉదయం వంటింట్లోకి అడుగుపెట్టిన శాంత విస్తుబోయింది. "అరే! వీళ్ళిద్దరూ అన్నాలే తినలేదు! తను నిన్న రాత్రి డ్యూటీకి బయలుదేరుతున్నప్పుడే ఏదో చెప్పబోయారు. తనే హడావిడిగా వెళ్ళిపోయింది. ఏవిటో తన జీవితమే యాంత్రికం. అసలు వాళ్ళని పట్టించుకోగలుగుతోందా! ఎందుకో ఇద్దరూ చాలారోజుల నుంచీ ఉదాసీనంగానే వుంటున్నారు. పెట్టింది తినటం, బడికి వెళ్ళి రావడం తప్ప ఆట, పాట బొత్తిగా తగ్గించేరు.

తనిక ఇలా అశ్రద్ధగా వుండకూడదు. వాళ్ళు ఎలా చదువుతున్నారో, ఉత్సాహం ఆసక్తి ఎందుకు తగ్గిపోయిందో గమనించాలి. ఇలా అనుకున్న శాంత పిల్లల స్కూలు మాష్టారూ తనకు ఒకే ఒక ఆత్మీయుడూ అయిన శరత్‌కు ఓసారి కబురంపింది. సూర్యం, సుధాకర్‌లు స్కూలునుంచి వచ్చేసరికి వాళ్ళకిష్టమైన స్వీట్‌రడీ చేసి దోసెలు వేస్తూ కూర్చుంది. "రండర్రా! మీకోసం మంచి మంచి టిఫిన్లు తయారుచేస్తోంది మీ అమ్మ" అంటూ పిలిచింది. ఇద్దరికీ కొసరి కొసరి తినిపిస్తుంటే కాలింగుబెల్ మ్రోగింది.

"రండి మాష్టారూ! మీ శిష్యులు కూడా ఇప్పుడే వచ్చారు" శరత్‌ని సాదరంగా ఆహ్వానించింది. "అన్నాయ్ మాష్టారొచ్చినట్టున్నారు!" చటుక్కున లేవబోయాడు. 'వస్తే రానీ! తినేసే వెళ్దాం. మాష్టారొచ్చింది మనకోసమా ఏమిటి?" నిర్లక్ష్యంగా అన్నాడు సుధాకర్.

" నిన్ను చూసి చాలా రోజులయిపోయింది. నేనే ఒకసారి వచ్చి పలకరించాలని ఎంతో అనుకుంటున్నానమ్మా! ఇంతలో నువ్వు కబురు చేశావ్. సాయంత్రం ఇంటికి వెళ్ళేసరికి మీ వదినె ఏ షాపింగ్‌కో, సినిమాకో బయల్దేరదీస్తుంది. కాదూ, కూడదూ అంటే నీకు తెలుసుగా! తనూ ఓ సత్యభామ!"

"భలే చెప్తారు మాష్టారూ!" శాంత ఫక్కున నవ్వింది.

"పేరుకే మా పురుషాధిక్యత. మీ రాజ్యమే కదా సాగేదీ?" జోక్ చేస్తూ శృతి కలిపేడతను.

ఆ గదిలోకి రాబోయిన పిల్లలిద్దరూ గిర్రున వెనుదిరిగి పెరటి వైపు పరుగెత్తారు. "ఛీ! అమ్మింతే! అందరూ ఎగతాళి చేస్తున్నారంటే చెయ్యరా మరి!" జామి చెట్టు ఎక్కి కూర్చుంటూ అన్నాడు సూర్యం.

"ఇంక అమ్మనడిగేద్దాంరా! అందరూ మనతో ఇలా అంటుంటే అస్సలు బాగుండడంలేదు." సుధాకర్ తల్లి పట్ల అసహ్యాన్ని వెళ్ళగక్కేడు. "కోతుల్లా జామి చెట్టెక్కి కూర్చున్నారా? ఇల్లంతా వెతికేను. మాష్టారికి 'నమస్తే' అయినా చెప్పకుండా మీ అల్లరే మీదా? చెట్లెక్కి గంతులేసే బదులు చదువుకోవచ్చుగా. ఎంత చీకటి పడిందో చూడండి!" అంటూ వచ్చి శాంత వాళ్ళని మందలించబోయింది. తల్లి అలా మాష్టారితో నవ్వుతూ మాట్లాడడం, టిఫిన్ అందించడం చెప్పుడు మాటల ప్రభావం వల్ల తప్పిదాలుగా తోచాయి ఆ పసివాళ్ళకి.

"మాకు నువ్వేం చెప్పక్కర్లేదు. నువ్వు చేస్తున్న పన్లేం బాగుంటున్నాయి? అమ్మవైతే అయ్యావ్, నువ్వు చెప్పినట్టు వినాలా?" ఉక్రోషంగా కళ్ళు తిప్పుతూ అన్నాడు సూర్యం. "అమ్మంటే దేవతంటారు. నువ్వు దెయ్యానివి!" పైకంటా ఎక్కేస్తూ అన్నాడు సుధాకర్. శాంత అదిరిపడింది. "ఒరే! పెద్దోడా! పడతావు నాన్నా! అసలెందుకు నా మీద కోపం? ముందు కిందకి దిగి, ఈ అమ్మ దగ్గరకి రండి. మీరు పడికాళ్ళో చేతులో విరగ్గొట్టుకుంటే ఈ అమ్మకి ఎంత బాధర్రా! కన్నా!" ప్రేమగా చేతులు చాచింది. ఆమె చూపులు పిల్లలపై వాత్సల్యపు సుధలు వర్షిస్తున్నాయి.

"ఎందుకు దిగాలేం? అసలు నువ్వు మా కక్కరలేదు" ఇద్దరూ చెరోమాట అంటుంటే శాంతకి కాళ్ళకింద భూమి కంపిస్తున్నట్టనిపించింది. "మా ప్రశ్నకి జవాబు చెప్పు" తల్లి కళ్ళల్లోకి తీక్షణంగా చూశారు. "అలా నెమ్మదిగా అడుగుతావేం తమ్ముడూ! ఇష్టం వుంటే తలచుకుని తలచుకొని ఏడుపొస్తుందట కదా? అమ్మెక్కసారైనా ఏడ్చిందా? అందరితోను రోజంతా నవ్వుతూనే వుంటుంది. ఔనమ్మా! నీకు నాన్న ఎప్పుడూ జ్ఞాపకం రాడా? మాకు అందరూ చెప్తున్నారు. చచ్చిపోయిన వాళ్ళంటే ఇష్టం వుంటే ఎప్పుడూ జ్ఞాపకం వస్తారట. మనసులో వాళ్ళే వుంటే అసలు ఊరుకోనే లేరట. గదిలోంచి యబటకే రావాలనిపించిదట. కాని మరి నువ్వో! అస్తమానం

ఎంచక్కా ముస్తాబై బయటకెళ్ళిపోతావ్" అని సూర్యం అంటే-

"ఇంట్లో వుంటే మాత్రం ఎంత సరదాగా వుంటావేం? మమ్మల్నైతే చదువుకోమని మాటిమాటికీ కోప్పడేసి వచ్చి వెళ్ళే అంకుల్స్‌తో ముచ్చట్లాడుతావు. రాజు వాళ్ళ బామ్మ, రాహుల్ వాళ్ళమ్మా, ఒకరేంటి? అందరూ మాతో ఇలానే అంటున్నారు" సుధాకర్ తన మనసులో పేరుకున్న అక్కసునంతా కుమ్మరించేడు. "ఇన్ని మాటలెందుకు? మా నాన్నంటే ఖచ్చితంగా నీ కిష్టం లేదుకదూ! చెప్పమ్మా!" సూర్యం నిలదీశాడు.

★ ★ ★

అలా వాళ్ళంటూంటే నిరుత్తరురాలై తలదించుకుని వెళ్ళిపోయిన తల్లి రూపం కళ్ళల్లో మెదల్తూంటే తెల్లారిపోయింది. గమ్యం చేర్చేశాను - అన్నట్టు హైదరాబాదు స్టేషనులో నిలబడిపోయింది 'గోదావరి'. బరువెక్కిన హృదయాలతో తల్లి వుంటున్న ఇంట్లో అడుగు పెట్టారిద్దరూ. 'విష్ణుప్రియ నర్సింగ్‌హోం' అన్న బోర్డు ఒడిలో పెట్టుకుని శూన్యంలోకి చూస్తూ సాక్షాత్కరించిందా మాతృమూర్తి. ఆ కళ్ళు ధారాపాతంగా వర్షిస్తున్నాయి. తల్లిపాదాలపై పడిపోయారిద్దరూ. ఆ రెండు చేతులు తల్లి కళ్ళు తుడవబోయాయి.

"ఒద్దురా! ఈ అమ్మని మనసారా ఏడవనివ్వండి. ఈ కళ్ళు శ్రావణమేఘాలు కానివ్వండి." వాళ్ళ చేతులను నెట్టేసింది. "ఇక నేను దుఃఖం అణచుకోవలసిన అవసరం తీరిపోయింది. చివరి క్షణాల్లో మీ నాన్నకిచ్చిన మాట నిలబెట్టుకోగలిగాను. మిమ్మల్ని ప్రయోజకుల్ని చేసి మీకంటూ జీవితాలేర్పరిచేను. ఎన్ని ఆటుపోట్లు ఎదుర్కొన్నానో ఎలా బ్రతుకు ఈడ్చుకొచ్చేనో బరువెక్కిన ఈ గుండెలకే తెలుసురా!" గుండెల మీద చేయి వేసుకుంది. "మీ నాన్నగారి పేరు నిలబెట్టుకుని అనుక్షణం ఆయననే తలచుకుంటూ రోగులకు సేవ చేసుకునే భాగ్యం కలిగిస్తున్నారు. అదే నాకు తృప్తిరా! మీరూ ఉన్నత స్థితికి చేరుకునేవరకు కళ్ళుదాటని కన్నీళ్ళుగా జీవించాను. ఇప్పటికి నా మనస్సు తేలిక చేసుకొనే అదృష్టం నాదయింది."

తల్లి అలా అంటుంటే నోట మాట రాలేదా తనయులకు. నర్సింగ్‌హోం స్థాపనకి తాము తల్లికోసం తీసుకొచ్చిన సొమ్మును తల్లి ఒడిలో వున్న బోర్డుపై నుంచి నమస్కరించారు.

●

('వనితా జ్యోతి' - మాసపత్రిక - ఫిబ్రవరి 1997)